
PRAMUKHANDHRA
22nd Year of Publication
We carry the news and views of Telugus
ప్రముఖాంధ్ర
₹ 15
ఫిబ్రవరి 2016
సంపాదకుడు
గోటేటి శ్రీ రామారావు
THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

# We Take Pride in **Nation Building**




- Operating Airports in India which are amongst the world's best
- Powering the Nation's march towards prosperity
- Providing connectivity through modern Highways
- Creating Special Investment Regions with integrated infrastructure to boost Indian industry
- Committed to giving back to the Community through GMR Varalakhsmi Foundation

GMR
Creating tomorrow today

www.gmrgroup.in



# ప్రముఖాంధ్ర



ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఫిబ్రవరి 2016

సంపుటి : 22 **254** సంచిక : 2


## భాష నిరంతరమూ ప్రయాణిస్తూనే ఉంటుంది! భాషా ప్రవాహాన్ని నిలువరించలేరు!!

– ఫిబవ్రరి 21న మాతృభాషకు అంజలి ఘటించండి!!! –

**ప్రయాణం ఆగదు!**
**ప్రవాహం నిలువదు!**

**భా**ష నిరంతం ప్రయాణిస్తూనే ఉంటుంది. జలం నిరంతరమూ ప్రవహిస్తూనే ఉంటుంది. ప్రయాణంలో నిబద్ధత ఉండాలి; ప్రవాహంలో నిశ్చలత ఉండాలి. పిల్లల మానసిక అభివృద్ధికి మాతృభాషే మార్గం కావాలి.

అన్నప్రాసన నాడు ఆవకాయ అన్నం పెట్టినట్లు- అక్షరాభ్యాసం నుంచీ అన్యభాషను రుద్దడం నేరం. మాతృభాషకాని అన్యభాషను రుద్దడం మాతృభూమికి చేసే ఘోర ద్రోహం, మతానికీ, కులానికీ అతీతంగా మాతృ భాషను ఆరాధించినప్పుడే ఆ జాతి వర్ధిల్లుతుంది. భాష ప్రవర్ధిల్లుతుంది. బెంగాల్ పౌరులు మాతృభాష బెంగాలీని కాపాడుకొనటం కోసం ఢాకా వీథుల్లో రక్తాభిషేకం చేశారు. వీథుల్లో తమ రక్తమాంసాలను అర్పణం చేసారు. మత రహితంగా ఉద్యమించి 'బెంగాలీ' భాషను కాపాడుకున్నారు. తూర్పు పాకిస్తాన్‌గా పిలువబడుతున్న ఆ దేశానికి బంగ్లాదేశ్-నే భాషా పేరును నిలుపుకున్నారు.

అలా బంగ్లాదేశ్ పౌరులు త్యాగస్ఫూర్తిగా నిలుపుకున్న 'ఫిబ్రవరి 21' అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవంగా వరలింది. ఐక్య రాజ్య విద్యా వైజ్ఞానికి సాంస్కృతిక సంస్థ యునెస్కో గుర్తించింది.

ఏ ఉద్యమం పుట్టినా, ఏ సాహిత్యం వికసించినా, ఏ విద్యానికేతనం వెలిసినా, నోబుల్ బహుమానంగా గుర్తింపబడినా, బెంగాలీ భాష, భాషీయులు ముందు వరుసలో నిలుస్తారు.

**భా**షా ఔన్నత్యపరంగా చూస్తున్నప్పుడు - ప్రపంచమెప్పుడో తెలుగు భాషా గొప్పదనాన్ని గుర్తించింది. నికొలాయ్ కాంటి అనే ఇటలీ భాషాజ్ఞాని తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్' అని ప్రశంసించాడు. ఆ పేరును మనం భవిష్యత్తరాలకు తెలుపవలసిన బాధ్యత మనకున్నది. ఆ భారము ఇప్పటి తరంపై ఉన్నది; ఇప్పటి ప్రభుత్వాలపై ఉన్నది.

**మ**నం ఎన్ని భాషలు మాట్లాడినా, ఎన్ని ఉద్యోగాలు చేస్తున్నా, ఊళ్లు ఏలుతున్నా మాతృభాషను విస్మరించడం నేరమవుతుంది. భాషా వ్యక్తీకరణలో మాతృభాషా కంఠస్వరాల మాధుర్యం ప్రత్యేకత కలిగి ఉంటుంది.

**త**ల్లిపాలతో పెరిగిన బిడ్డకూ, పోతపాలతో పెరిగిన బిడ్డకూ ఉన్న వ్యత్యాసమూ, శక్తి లోపమూ, పసిగట్టవచ్చు. తెలుగుభాష స్వయంభువు కాబట్టి - ఎన్ని సంకరములు చుట్టుముట్టినా, భాషా మధురిమ చప్పబడలేదు.

అన్యభాషా పదాలెన్నో తెలుగులో చొరబడ్డాయ్. అయినా భాషా సొగసులు చెరబడలేదు. మాతృభాషా తీపిదనాన్ని ఫిబ్రవరి 21 నాడైనా రుచిచూడమని కోరుతున్నా. మనల్ని నడుపుతున్నది సంధియుగం, సంధిరోగం వంటిది! సంకర యుగం అని అనవచ్చు. స్వచ్ఛత అనునది ఏ విషయంలోనూ ఉండదు. 'కల్తీ' కనిపిస్తుంది.

మనిషి కల్తీ! మనిషత్వం కల్తీ! మాట్లాడే భాష కల్తీ. మనోభావం కల్తీ! కలియుగమనుకోగలమా? కల్తీయుగమనుకోగలమా?

**న**వంబర్‌లో ఒక నెల కురవవలసిన వాన, ఒకే ఒక రోజు కురిసింది. దుమ్మూధూళి కల వీథులు మురికి కూపాలయ్యాయి. నేల సాగరమైననూ నీరు నేలపై నిలువలేదు. బురదను నిలిపింది! సాగరజలం మేఘమైంది! మేఘం జ్వలించింది. జలప్రళయంగా మార్చివేసింది! జన జీవనం. జలమయమయింది. నిలువని జల ప్రవాహం నిలుపుకునే శక్తి నీలి సాగరానికే ఉన్నది. సాగరాన్నుంచీ వచ్చిన జలం తిరిగి ఆవిరిగా సాగరానికే చేరుకుంటుంది. ఆగని ప్రయాణం ఆగదు, పారే జలప్రవాహం నిలువదు.



బుధజన విధేయుడు

*– గోటేటి శ్రీరామారావు*

ముఖపత్రం : **పార్వతీ పరమేశ్వరి కుటుంబం**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# జయహో ఆంధ్ర కేసరీ!



## ఆంధ్రకేసరి-! ఆంధ్రకేసరికి సరియగు వారెవ్వరూ లేరు!

**ఆంధ్రకేసరి కారణంగానే ఆంధ్రరాష్ట్రం వచ్చింది! ఆంధ్రులకు విలువగొని తెచ్చింది; ఆంధ్రరాష్ట్రము రావడానికి కారకుడాయనే!**

ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంతి! ఆంధ్రప్రదేశ్ అవతరణకు కారకుడు! ఆంధ్రపౌరుషానికి ప్రతీక. ఆంధ్రపద వెలుగు నిర్దేశకుడు. అవినీతిని ఆమడదూరం తరిమినవాడు. ముఖ్యపదవీ విరమణానన్తరం డబ్బుల్లేక హైదరాబాదు నుంచీ ఒంగోలుకు కాలినడకనే వెళ్ళాడు.

'దమ్ముంటే కాల్చరా – గుండెలు చూపినవాడు. నెహ్రూవంటి జాతీయ నాయకులను ఎదురించి నిలిచినవాడు, మద్రాసుతో కూడిన ఆంధ్రరాష్ట్రమే కావాలని భీషణపట్టు పట్టినవాడు.

ఎందరో రెడ్డి నాయకులను, పీడిత నాయకులను పైకి తెచ్చినవాడు. హరిజనోద్ధరణకు అవిశ్రాంతంగా కృషి చేసినవాడు స్వార్థమెరుగనివాడు.

రాజకీయాల్లో భిక్షాధికారులు లక్షాధికారులైనవారున్నారు గానీ, రాజకీయాల్లో ప్రవేశించి గూడు కూడు పోగొట్టుకుని చినిగిన లాల్చీలు ధరించాడు. ఆయన వద్ద పెరిగి పెద్దయిన నాయకులే ఆయన్ను వెన్నుపోటు పొడిచారు. ఆయనెవరికీ సలాము కొట్టి జీవించలేదు. కేసరిలా జీవించాడు, జీవితం చాలించాడు. ●

## శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము



# ధర్మానికి గ్లాని అంటే?



**విశుద్ధ జ్ఞానదేహాయ త్రివేదీ దివ్య చక్షుషే।**
**శ్రేయః ప్రాప్తి నిమిత్తాయ తమస్సోమార్థ ధారిణే ॥**

మనది సనాతన ధర్మం. అనాది కాలం నుండి మనం సనాతన ధర్మాన్ని అనుసరిస్తూ వస్తున్నాం. ఈ ధర్మం క్షీణించే ప్రమాదమేర్పడినప్పుడు భగవంతుడు భూమిపై అవతరిస్తాడని మన దృఢమైన నమ్మకం. భగవద్గీతలో ఈ మాట ఉన్నది.

**యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత।**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥**

ధర్మాన్ని పునః స్థాపించటానికై తాను అవతరించాలని భగవంతుడు సంకల్పించాడు. ధర్మము ఎందుకు క్షీణిస్తుంది? ధర్మం క్షీణించడమంటే ఏమిటి? ధర్మం క్షీణించటమంటే ప్రజలు తమ నిత్య జీవితంలో ధర్మాన్ని ఆచరించటం లేదని, ప్రజలు ధర్మాన్ని ఆచరించక, తమకిష్టమొచ్చిన రీతిలో గడపటంతో ధర్మం క్షీణిస్తుంది. ప్రజలు అలా ఎందుకు జీవిస్తారో శాస్త్రాలు వివరించాయి.

ధర్మాన్ని అనుసరించమంటే, నిర్దిష్టమైన నీతిని అనుసరించాలి. ఉదాహరణంగా మనం స్వీకరించే ఆహారం విషయంలోనే చెప్పుకోవచ్చు. మనం తీసుకోదగిన ఆహారమేమిటి? దేనిని తీసుకోకూడదు. నిషేధించిన ఆహారాన్ని తీసుకొంటే ఎటువంటి చెడుఫలితాలు వస్తాయి? ధర్మం ఈ సందర్భంలో కొన్ని ఖచ్చితమైన నీతి సూత్రాలను ఏర్పరచినది. శ్రీకృష్ణ భగవానుడు ఆహారం గురించి భగవద్గీతలో చెప్తూ సాత్త్వికం, రాజసం, తామసం అని ఆహారం మూడు రకాలన్నాడు. మానవులు రాజస, తామస రకాలను త్యజించి, సాత్త్వికాహారాన్ని స్వీకరించాలని బోధించాడు. కాని కొంతమంది శ్రీకృష్ణ పరమాత్మ కంటె అధికారికంగా బోధిస్తుంటారు. తామసాహారాన్ని తీసుకుంటే ఏమవుతుంది? మనం ఎక్కువగా తామసాహారాన్నే భుజించాలి అని చెప్తారు వాళ్లు. వాస్తవానికి ధర్మాన్ని ఏ మాత్రం అనుసరించని వాళ్లు, ధర్మంపట్ల గౌరవంలేనివాళ్లు, ఎటువంటి నియమం పాటించనివాళ్లు, ధర్మసూత్రాలను పరిగణనలోకి తీసుకోరు. ధర్మసూత్రాలు అవసరంలేని సంకెళ్లుగా వాళ్లు భావిస్తారు. ఇంద్రియాలపై నియంత్రణలేని వారు సత్కార్యాలను ఆచరించలేరు. ఎప్పుడూ దుష్కర్మలనే ఆచరిస్తారు.

పిల్లలు మొండిగా ఉంటారని చెప్తూంటాం. వాళ్లు పెద్దలు వద్దన్న పనులే చేస్తుంటారని వాళ్లమీద ఆరోపణ. కాని మన ప్రవర్తన కూడా అలాగే ఉంటుంది. శాస్త్రాలు నిషేధించిన కార్యకలాపాలలో పాల్గొంటుంటాం. అవి నిషేధించబడ్డాయి కాబట్టే మనకు వాటి నాచరించాలనెడి కోరిక కలుగుతుంది. మన తప్పులను సరిదిద్దుకోటానికి వీలుగా ఏ మాత్రం మనం చేసిన పనుల గురించి పునః ఆలోచించం. 'ప్రయో నేతిశ్రుతి విషయతా విశ్వమాధుర్యహేతుః'- శాస్త్రాలలో చెప్పిన విషయాలను వ్యతిరేకించటం మానవ సహజం. ఈ విషయాలను నిరూపించటానికి చాలా ఉదాహరణలున్నాయి.

**న్యాయ్యాదర్థాదపి కిమధికం లభ్యమన్యార్గవృత్త్యా**
**వైధాదన్నాదపి కిమధికం; పర్యుదస్తేషు భోజ్యమ్ ।**
**కాన్తా భోగాదపి కిమధికం? పణ్య కాన్తాసు భోగ్యం**
**ప్రాయోనేతిశ్రుతి విషయతా విశ్వమాధుర్యహేతుః॥**

గృహంలో వండిన ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాన్ని పిల్లవాడు వద్దంటాడు. కాని హోటల్‌లో అనారోగ్య పరిస్థితులలో వండిన ఆహారాన్ని ఇష్టపడతాడు. ఇంట్లో తయారు చేసిన పదార్థాలను ఎందుకు వద్దంటున్నాడో తెలియదు. అలాగే ధనార్జన తప్పుకాదు. కాని దానిని న్యాయమైన మార్గంలో సంపాదించాలి. ఈ కాలంలో పరిస్థితి వేరుగా ఉన్నది. న్యాయంగా సంపాదించి కుటుంబాన్ని పోషించడం కష్టమనీ, అన్యాయంగా సంపాదించినవారే ప్రపంచంలో విజయవంతమైన జీవితాలను గడుపుతున్నారనీ ప్రజలు చెప్తుంటారు. ప్రాణం నిలుపుకోటానికి చాలా కొంచెం చాలు. ధనవంతులైనా, పేదవారైనా ప్రాణం నిలుపుకోవటానికి తినేది ఒకే ప్రమాణంలో ఆహారం.

శాస్త్రాలు నిషేధించిన మార్గాలను అనుకరిస్తూ, మనిషి ధనార్జన చేస్తుంటాడు. నిషేధించినది అనగానే మనిషికి దానిపట్ల ఆకర్షణ పెరుగుతుంది. శాస్త్రాలు నిషేధించిన దానిని తప్పక తినాలని మానవుడు భావిస్తాడు. మీ భార్యతో ఆనందంగా జీవితం గడపగలిగనప్పుడు అక్రమ సంబంధాలు ఎందుకు? ఈ ఉదాహరణాలన్నీ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. చిన్నపిల్లల వలె మనం కూడ వద్దు, అది నిషేధించబడినదని చెప్పిన దానిపట్ల ఆకర్షితులవుతున్నాం.

ధర్మం పతనమవుతున్నదనే మాటలను అర్థం చేసికొనటానికి ప్రయత్నిస్తున్నాం. క్రమబద్ధమైన, నియమపూరితమైన జీవితాన్ని వ్యతిరేకించేవారు, ఉల్లంఘించేవారు ధర్మపతనానికి కారకులువుతున్నారు. ఇటువంటి వారి సంఖ్య పెరిగితే ధర్మం మరింత వేగంగా పతనమవుతుంది. వారిని ప్రశ్నిస్తే వారు ఎదురుతిరిగి ఇతరులను నిందిస్తూ తమను తాము సమర్థించుకోజూస్తారు. ధార్మిక నియమాలు మన జీవితాలలో ప్రతి విషయాన్ని నియంత్రించాలని చూస్తాయి అని వాళ్లు ఆరోపిస్తారు. ప్రాతః కాలం నుండి రాత్రి పడుకునేదాకా మానవజీవితాన్ని ధర్మం నియంత్రిస్తుంది. ప్రాతఃకాలంలోనే నిద్రలేవాలి. స్నానం చేయాలి, సంధ్యావందనం ఆచరించాలి. దేవుని పూజించాలి. అతిథులకు సేవలనందించాలి. ఇలా ఎన్నో విషయాలలో మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. రోజంతా ఏదో ఒక పనిలో నిమగ్నులై ఉండాలి. తమ జీవన విధానంలో ధర్మం నిర్దేశించే ఈ విధమైన పనులు చేయటానికి సమయంలేదని వాళ్లు వాపోతుంటారు. అందువలన ధర్మాన్ని వదలిపెట్టమంటారు. వాళ్లు చెప్పే ఈ కారణాలన్నీ కుంటిసాకులుగా స్పష్టంగా కనపడుతున్నాయి. అవి పరీక్షకు నిలువవు. నియంత్రణలేని జీవితాన్ని గడపాలని వాళ్లు కోరుకొంటున్నారు. అందువలన నియమాలు, నియంత్రణలు వారికి అనవసర అడ్డంకులు. ఈ విధమైన ఆలోచనాధోరణి వారిని ధర్మానికి దూరంగా ఉంచింది. అంతేకాదు సామాన్య మానవులకై సూచించబడిన విహిత కర్మలకు కూడా వారు దూరమైపోతున్నారు. ఈ దశను చేరుకొంటే ధర్మపతనం ప్రారంభమైనట్లే. ●



# మాపై కరుణ చూపే తల్లి! మా తల్లి అలిమేలు మంగా!! మమ్ము చల్లంగ ఉండాలని దీవించు తల్లీ!

నిఖిల జగములకు శ్రీనివాసుడు సుప్రజారాముడు, ఆ రాముని హృదయాన్ని అలరింపచేసే సీతమ్మ తల్లి అలిమేలు మంగా! మన్మథనామ సంవత్సరం కూర్చిన మనోవ్యధను- దుర్ముఖిలో కలుగకుండా చూడు తల్లీ? మా ఏలిక శ్రీనివాసుని హృదయాంత రాణీ! మా జననీ!

పద్మావతీదేవి బ్రహ్మోత్సవాలు తిరుచానూరుకు పెళ్లికళ తెచ్చింది. ఊరు ఊరంతా విడిదిల్లు అయింది. తిరుమలగిరి నుంచి సిగ్గులొలకబోస్తూ శ్రీనివాసుడు సారెతో బయల్దేరి వస్తాడు. ముక్కోటి దేవతలూ చుట్టాలై వస్చారు. మహర్షులే పురోహితులు!

తిరుచాన ఊరు అంటే శ్రీకాంత, సిరులు వెలసిన ఊరు. తిరుచానూరు. శ్రీమహాలక్ష్మి శ్రీ జగన్మాత కొలువైన ఊరు. శుకమహర్షి ఆశ్రమ ప్రాంతమిది. శ్రీశుకుని ఊరు శ్రీశుకనూరుగా కాలక్రమంలో తిరుచానూరుగా వ్యవహరించేవారు. తిరుపతి





పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో తిరుచానూరు ఉంది. ఇక్కడ కొలువైన అలర్‌మేల్ మంగ (శ్రీమహాలక్ష్మి) భక్తుల పాలిట కల్పవల్లి, శ్రీమహావిష్ణువు హృదయేశ్వరి. అలమేలు మంగమ్మ.

బ్రహ్మోత్సవాలలో తిరుచానూరు, తిరుమలను మించి కనిపిస్తుంది. ప్రపంచం నలుమూలల నుంచీ జనులు తరలివస్తారు. దేవేరి ఉత్సవమైతే దేవదేవునికి పండు! ఆ పదిరోజులు శ్రీనివాసుడు ఇక్కడే ఉంటాడని భక్తుల నమ్మకం. అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబరు డిసెంబర్ నెలల్లో జరిగాయ్. పంచమీతీర్థం అత్యంత ఘనమైనది విశిష్టమైనది.

ఈ ప్రాంతంలో అమ్మవారు కొలువై ఉండటంపై ఓ ఐతిహ్యం ఉంది. త్రిమూర్తులలో సత్వగుణ సంపన్నులెవరో తెలుసుకోవడానికి భృగుమహర్షి బయల్దేరాడు. మొదట బ్రహ్మను, శివుడినీ పరీక్షించాడు. ఆ తర్వాత వైకుంఠపురానికి ప్రయాణం కట్టాడు. శేషశయ్యపై లక్ష్మీదేవితో శ్రీమన్నారాయణుడు ఏకాంతంగా ఉన్న సమయంలో అక్కడి కెళ్లాడు. ఆ తర్వాత శ్రీవారి వక్షస్థలంపై తన్నడం, శ్రీమహావిష్ణువు ఆ మహర్షి పాదనేత్రాన్ని నిర్మూలించడం, అమ్మవారు అలిగి వెళ్లిపోవడం- ఆ కథంతా సుపరిచితమే. ఆ తర్వాత శ్రీహరి అమ్మవారి ఆచూకీ కోసం తపస్సు చేయగా... పద్మసరోవరంలో బంగారు పద్మంలోని కర్ణిక మధ్యలో శ్రీమహాలక్ష్మి ఆవిర్భవించింది. ఇలా పద్మం నుండి జన్మించింది కాబట్టి అలర్‌మేల్‌మంగ అన్నారు. తమిళంలో అలర్ అంటే పద్మం. మేల నుంచి పుట్టిన, మంగ మంగళప్రదమైన తల్లి అర్థం ఉంది. ఆ పద్మసరోవరమే నేటి అమ్మవారి కోనేరు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా.. అమ్మవారి జన్మనక్షత్రమైన శుక్లపంచమి రోజు నిర్వహించే పంచమతీర్థానికి ఎందరో భక్తులు వస్తారు. ఈ సరోవరంలో స్నానం చేస్తారు.

## ఆదిలో అమ్మవారి పెత్తనమే!

పూర్వం నుంచీ తిరుచానూరుకు విశేష ప్రాధాన్యం ఉంది. తొలినాళ్ళలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్ని అమ్మవారి సన్నిధిలోనే నిర్వహించేవారు. ఇక్కడి పెద్దల సభ నిర్ణయం ప్రకారమే తిరుమలలో కార్యక్రమాలు జరిగేవి. కాలక్రమంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని విజయనగర రాజులైన సాళువ నరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించారని తెలుస్తోంది. తిరుమల శ్రీవారికి ఆగమశాస్త్రం ప్రకారం జరిగే నిత్య కైంకర్యాలన్నీ అమ్మవారికీ జరుగుతాయి. ఉదయం సుప్రభాతంతో సేవలు ప్రారంభం అవుతాయి. మూలమూర్తికి సహస్రనామార్చన జరిగిన తర్వాత నివేదన ఇస్తారు. పద్మావతి పరిణయం పేరుతో నిత్య కళ్యాణోత్సవం, ప్రతి సాయంత్రం డోలోత్సవం నిర్వహిస్తారు. సోమవారం అష్టదళపాద పద్మారాధన, గురువారం తిరుప్పావడ సేవ, శుక్రవారం అభిషేకం ఉంటాయి. శుక్రవారం కళ్యాణోత్సవానికి ముందు లక్ష్మీపూజ జరుపుతారు. ప్రతి సంవత్సరం జ్యేష్ఠ మాసంలో తెప్పోతవాలు నిర్వహిస్తారు. కార్తీక శుద్ధ పంచమికి పూర్తి అయ్యేట్లుగా ప్రతి సంవత్సరం పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయ్.

ఆలూమగలంటే ఎలా ఉండాలో పద్మావతి శ్రీనివాసులను చూసే నేర్చుకోవాలంటాడు అన్నమయ్య. ●

# మమతా వాత్సల్య శ్రేయోమూర్తి ఎం.వి.ఎస్. మూర్తి




ఎం.వి.యస్. మూర్తిగారి మమతా వాత్స్య శ్రేయఃకాముకత్వం గూర్చి వ్రాయాలంటే పేజీలకు పేజీలు వ్రాయవచ్చు.

నా 83 సంవత్సరాల జీవితంలో ఇంతటి విశిష్ట, విలసిత లక్షణాలు గల సహృదయుణ్ణి మరొకర్ని చూడలేదు.

రాజకీయాల్లో ఉన్నా – రాజకీయ లక్షణాలు లౌక్యాలు కనిపించవు.

గోల్డుస్పాట్ మూర్తిగా ప్రసిద్ధినొందిన ఆయన మనసు గోల్డే! ఆయనతో తొలి ముఖ పరిచయం విచిత్రంగా జరిగింది. ప్రముఖాంధ్ర పత్రికను ఆయనకు పంపిస్తున్నప్పటికినీ యెపుడూ ఇరువురమూ కలుసుకోలేదు. అందరు ప్రముఖులకు పంపించినట్లుగానే– పాట్రన్ అభ్యర్థ ఫారాన్ని ఆయనకు పంపించాను.

ప్రపంచ తెలుగు సమాఖ్య కార్యవర్గ సమావేశంలో పాల్గొనడం కోసం విశాఖపట్టణం వెళ్ళాను. దసపల్లా హోటల్‌లో మకాము చేసాను. అక్కడి హాలులోనే సమావేశం. ఒక్కొక్కరమే వెళ్లి మా స్థానాల్లో కూర్చుంటున్నాం. మూర్తిగారొస్తున్నారు, మూర్తిగారొస్తున్నారంటూ కొందరు నిలబడ్డారు. నేనూ నిలబడ్డాను. ఆయన చిరునవ్వు నవ్వుతూ నావద్దకు వచ్చి చేతిలో ఓ ఎ4 సైజు కవర్ పెట్టారు. నేనేదో మేటర్, అయి ఉంటుందని భావించాను. తరువాత కవరు తెరచి చూస్తే– నేను పంపిన పాట్రన్ దరఖాస్తు ఫారం, అందు జతరపరచిన రూ. 25,000/- చెక్కు ఉంది. చూచి ఆశ్చర్యపోయాను. ఉత్తరాలపై ఉత్తరాలు వ్రాసినా ప్రముఖాంధ్రనందుకుంటూ ప్రతిస్పందించని ఆ రోజుల్లో– పెద్దగా పరిచయం లేని వ్యక్తి నన్ను గౌరవిస్తూ రూ.25000లు చెక్కును జతపరచి కవరు నివ్వడంలోగల ఆయన ఉదారతకు ఎంతో ఆనందమూ ఆశ్చర్యమూ కల్గించింది.

అప్పటికాయన గీతం యూనివర్శిటీని ప్రారంభించలేదు. గోల్డుస్పాటు వ్యాపారం ఉందో లేదో తెలియదు. కానీ ఆ 'స్పాటున వారి గోల్డు' మనసే నాకు కనిపించింది. ఎం.పి.గా, విశాఖలోని ప్రముఖ వ్యక్తిగా, ప్రపంచ తెలుగు సమాఖ్య వైస్ ప్రెసిడెంట్‌గా మాత్రమే నాకు పరిచయం. ఆ సమావేశం, విందుకు, 'హోస్టు' ఆయన యేమో కూడా జ్ఞాపకం లేదు.

విశాఖలోనే ఆయన విద్యాభ్యాసం చేసారు. న్యాయవాద పట్టం అందుకున్నారు. హైకోర్టు న్యాయవాదిగా మంచి పేరుప్రఖ్యాతుల నార్జించారు. అటు తరువాత వ్యాపారం ప్రారంభించారు. 1983 సం॥ నందమూరి తారకరామారావుగారి పిలుపుతో, తెలుగుదేశం పార్టీలో చేరారు. కాంగ్రెస్ నియోజకవర్గంగా ఉన్న విశాఖనగరం ఆయన కారణంగానే తెలుగుదేశం వశమైంది. ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్సు అధ్యక్షపీఠం వరించింది. విశాఖ నగరాభివృద్ధి సంస్థ అధ్యక్షులయ్యారు. లోక్‌సభ సభ్యుడయ్యారు. ఉత్తమ లోక్‌సభ సభ్యునిగా కీర్తింపబడ్డారు.

పదవి ఉన్నా లేకపోయినా, ఆయన విశాఖ నగర ప్రముఖుడు, సేవాభావం కలవాడు. పదిమంది అభ్యున్నతికి దోహదపడువాడు. విద్యా ప్రదాత, వినయ ప్రదాత. నారాచంద్రబాబు అభిమానం సంపాదించినవాడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడు!

నేను విశ్వసించే శ్రేయోభిలాషి, చిరకాలం ఆయన ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఏడుకొండల వేడును ప్రార్థిస్తున్నాను. ●



# ఆంధ్రా కోణార్క్ అరసవల్లి

ప్రత్యక్ష భగవానుడు సూర్యనారాయణమూర్తి. ఆయనకు దేశంలో పలుచోట్ల ఆలయాలున్నాయ్. మన రాష్ట్రంలోని అరసవల్లి సూర్యాలయం ముఖ్యమైనది. అరసవల్లిని ఆంధ్రా కోణార్క్ అని పిలుస్తూ ఉంటారు. శ్రీకాకుళం సమీపంలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి పాదాలకు సూర్యకిరణాలు తాకే దృశ్యం ఎంతో మనోహరంగా ఉంటుంది. భక్తుల పాపాలను హరించి, మంచి ఆరోగ్యాన్ని, మంచి బుద్ధిని కలిగించే దేవునిగా హిందువులు సూర్య నారాయణమూర్తిని ఆరాధిస్తున్నారు. సూర్యభగవానుడు నమస్కార ప్రియుడని ప్రతీతి.

సూర్యారాధన మనకు తరతరాలుగా వస్తున్న ఆచారం. ఒక్క రోజు సూర్యోదయం కాకపోతే మనుషులే కాదు జీవులంతా విలవిలలాడి పోవల్సిందే! వర్షాకాలంలో ఆకాశం మేఘావృతమై సూర్యబింబం కానరాకపోతే మన పెద్దలు భోజనం మానేసి ఉపవాసాలు ఉండేవారు. ఎన్నో దీర్ఘకాలిక రోగాలు సూర్యనమస్కారాల వల్ల నయమవుతాయని నమ్మకం. బారెడుపొద్దు ఎక్కేవరకే నిద్రలేవనివారిని దారిద్ర్యం పీడిస్తుందని పెద్దలు హెచ్చరిస్తూ ఉంటారు. సూర్యుణ్ణి ఎంతగా ఆరాధిస్తే మనం అంతగా ఆరోగ్యవంతులమవుతాం.

అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఏడవ శతాబ్దంలో నిర్మించారు. పురాణకథనం ప్రకారం ఒకసారి ఇంద్రుడు కోటేశ్వరుని ఆలయంలో చొరబడేందుకు ప్రయత్నించినప్పుడు శివుని వాహనమైన నంది ఇంద్రుణ్ణి తన్నిందని. దూరంగా వెళ్లి పడిన ఇంద్రుడు తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంగా సూర్యుణ్ణి ఆరాధించి, అరసవల్లిలో సూర్యునికి ఒక ఆలయాన్ని నిర్మించాడంటారు.

అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి ఆలయంలో మూలవిరాట్ ఐదు అడుగుల ఎత్తున నల్ల గ్రానైట్ రాయిపై చెక్కబడి ఉంటుంది. ఆయనకి ఇరువైపుల ఉష, ఛాయ దేవిలుంటారు. సప్తాశ్వాల రథంపై సూర్యభగవానుని విగ్రహం ప్రతిష్టితమై ఉంటుంది. నాల్గవ శతాబ్దం నుంచి 14వ శతాబ్దం వరకూ కళింగ రాజ్యాన్ని పరిపాలించిన తూర్పు కళింగ రాజులు అరసవల్లి ఆలయాన్ని ఆనాటి శిల్పకళకు అద్దం పట్టేరీతిలో నిర్మించారు. ఒడిషా విశ్వకర్మ శిల్పుల ప్రావీణ్యానికి ప్రతీకగా ఈ ఆలయం నిలిచింది. ఫిబ్రవరి, జూన్ మాసాల మధ్య సూర్యభగవానుని మూలవిరాట్ పాదాలను సూర్యకిరణాలు రెండు సార్లు తాకుతాయి. ఇంతటి అద్భుతమైన శిల్పకళానైపుణ్యాన్ని మరెక్కడా చూడలేం. ఆలయంలో ఐదు దేవతా విగ్రహాలు ఆదిత్యుడు, అంబిక, విష్ణు, గణేశుడు, మహేశ్వరుల విగ్రహాలు ఒకే చోట ప్రతిష్టితం కావడం విశేషం. అరసవల్లి ఆలయాన్ని సందర్శించేందుకు మామూలు రోజుల్లో కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తూ ఉంటారు. మాఘమాసంలో ఆదివారాలనగా రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు.

కంటి వ్యాధులు, చర్మవ్యాధులతో బాధపడేవాడు సూర్యభగవానుడికి మొక్కుకుని నివారణ పొందవచ్చున్నది ప్రజల విశ్వాసం. రోగాల నుంచి విముక్తి పొందిన వారు అరసవల్లి సూర్యనారాయణమూర్తికి మొక్కుబడులు చెల్లించుకుంటారు. సూర్య నమస్కారాలు, ఆదిత్య హృదయంం పఠనంతో ఆయురారోగ్యాలు లభిస్తాయని మన పెద్దలు ఆచరించి చూపిన మార్గం ***సాక్షాత్తూ సూర్యనారాయణ వంటివారు కృష్ణయాజీ సూర్యసదనం స్థాపకులు. అరసవల్లి అనేసరికి సూర్యసదనం***




***కృష్ణయాజీగారు జ్ఞాపకం వస్తారు. కృష్ణయాజిగారు అరసవల్లిలో మూడు పర్యాయములు సూర్యయాగం చేసారు. ఆ ఆలయ అభ్యున్నతిలో కృష్ణయాజీగారి అనుబంధం ఎంతో ఉన్నది.***

***శ్రీభాస్కరునిగామ పాఠశాల, శ్రీభాస్కర ఆయుర్వేదనిలయం– ఇత్యాది విద్య వైద్య విజ్ఞాన సంస్థలను సూర్యనారాయణ పేరునే స్థాపనం చేసారు. ఎన్నో ఆలయాల జీర్ణోద్ధరణం చేసారు.***

***గరివిడిలోని వారి నివాస నిలయానికి 'సూర్యసదనం' అని నామకరణం చేసారు. మీదుమిక్కిలి– భారతదేశం గర్వించదగిన సూర్యోపాసకులు. అరసవల్లి సూర్యనారాయణను స్తుతించేటప్పుడు గరివిడి సూర్యసదనం వ్యవస్థాపకులు సద్గురు కృష్ణయాజిగారినీ ప్రస్తుతించి తీరాలి!*** ●






## అమెరికాలో -
# మా వూరు వెంకటరమణ దంపతులకు సన్మానం

**C.M.R.** మెగా షోరూమ్ అనగానే ముఖ్యంగా గుర్తుకు వచ్చే మంచి వ్యక్తి మావూరి వెంకటరమణ– ఆయన్ను అడిగిలేదనిపించుకున్నవాడు లేడంటారు. ఆయన రాయని భాస్కరుడు. అపార దానశీలి. ప్రపంచ తెలుగు సభలకు విశాఖపట్నం వెళ్లినప్పుడు, తిరుగు ప్రయాణంలో ఆయన్ను కలిసాను. అక్కడో రాజుగారుండేవారు. రాజు గారంటే నాకు ప్రేమ. రాజుగారిపైవారికి ప్రేమ. కుశలములడుగుతూ ఓ అడ్వర్టయిజ్‌మెంటు నడిగాను. వెంటనే రూ.10,000లు యిచ్చారు. ఫుల్‌పేజీ రూ.15,000లు అన్నాను. మిగతా డబ్బు కూడా బుగ్గలపై చంద్రికలు చల్లినట్లుగా అమిత సంతోషంతో యిచ్చారు. పట్టుబట్టలిచ్చీ ఎంతో మర్యాద చేసారు.

**మంచికి నిలయం మా వూరి వెంకటరమణ! శతసంవత్సరాలు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలి.**

# సినిమాకు పోటీగా సురభి నాటకం నిలిచింది! కుటుంబ (పరి)శ్రమగా వర్ధిల్లింది!! పౌరాణిక నాటకాలనే ప్రదర్శిస్తూ పౌరుల్లో భక్తి చింతన పెంచింది!!

మహారాష్ట్రకు చెందిన మరాఠీ కుటుంబాలు ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా, చక్రాయపేట మండలంలోని సురభి అనే కుగ్రామానికి వచ్చారు. తోలుబొమ్మలాటల్ను నాటకంగా మార్పు చేస్తే చాలా బాగుంటుందన్న ఆలోచనే సురభినాటక సమాజానికి మూలకారణమయ్యింది. తొలినాటకంగా 1885లో 'కీచకవధ'ను కిరోసిన్ దీపాలు, కాగాడాల మధ్య ప్రదర్శించారు. నాటకం జనాన్ని విశేషంగా ఆకట్టుకోవడంతో గోవింద రావు, పెద్ద రామయ్యకు ఆ గ్రామపెద్దలు గ్రామంలోనే ఒక ఇల్లును సమకూర్చి యిచ్చారు. నాటక రంగానికి శ్రీకారం చుట్టారు. అప్పటినుంచి సురభిగ్రామం పేరే కళాకారులకు ఇంటిపేరుగా మారిపోయింది.

సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని రోజుల్లోనే సినిమా సెట్టింగులను తలదన్నేరీతిలో సెట్టింగులు అమర్చి, నాటకాలను ప్రదర్శించి, సామాన్య ప్రజల నుంచి సంపన్న వర్గాలను సైతం అబ్బురపరిచారు. 125 ఏళ్ల క్రితం మహారాష్ట్ర ప్రాంతం నుంచి వలసవచ్చిన వీరు తొలుబొమ్మలాటలతో జీవిత బండిని నడిపేవారు. చిన్న పెద్ద అన్న తారతమ్యం లేకుండా ఏపాత్రనైనా అవలీలగా పోషించడం వీరిలోని ప్రత్యేకత. నాటకాలవాళ్లంటే చులకన భావం ఉన్నవారితో వీరికీ సంబంధం లేదు.

నాటకాలు ఆడేవారంటే దురలవాట్లకు గురువుతారనే భావన సహజం. అయితే వీరందరికీ ఎటువంటి దురలవాటలు లేకపోవడమో విశేషం. ఈ నాటక సమాజం ఇంతకాలం జీవించడానికి కారణమని చెప్పొచ్చు. అప్పటితరం వారిని ఎరుగకున్నా, ఈ తరం వారిలో కృషి, పట్టుదల, అన్నిటికీ మించిన క్రమశిక్షణ ఉంది. నాటకం ఆడేవారు ఆడుతుంటే తెరవెనుక పనులు అలవోకగా పూర్తయిపోతుంటాయి. ఎవరి పనిలోవారు మునిగిపోతారు. ఇదో కుటుంబ వ్యవస్థ... సురభి అంటే కుటుంబం ఇందులోని కళాకారులంతా బంధువులే. బంటు నుంచి రాజువరకు వయసుతో తేడా లేకుండా పాత్రల్లో లీనమైపోతారు.

**కుగ్రామం నుంచి జాతీయ స్థాయికెదిగారు...**

రాష్ట్రంలో సురభి కళాకారులు గుర్తింపు పొందడానికి ఐఏఎస్ అధికారి కె.వి.రమణాచారి, గరిమెళ్ల ఆద్యులు కాగా, జాతీయ స్థాయిలో ఖ్యాతికి బి.వి. కారంత్‌ని చెప్పొచ్చు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న వీరిని నగరానికి తీసుకొచ్చి ప్రదర్శనలు ఇప్పించి అన్ని విధాలా రమణాచారి సహాయం అందించారు. పద్మశ్రీ బి.వి. కారంత్ కళాకారుల్లో ఉన్న ప్రతిభను మరింత మెరుగులు దిద్దారు. ఆయన దర్శకత్వంలో భీష్మ, చండీప్రియ, బస్తీదేవ యాదమ్మను ప్రదర్శించి ఆయన మెప్పు పొందారు. అర్జా శ్రీకాంత్ సమయంలో 45 రోజుల పాటు వర్క్‌షాపును కూడా నిర్వహించారు. న్యూఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, బెంగుళూరులోని ఆర్.ఆర్.సి. స్పందన సంస్థలు అందుకు సహకారాన్ని అందజేశాయి.

తొలినాళ్ళలో సురభి సమాజాలు 60 ఉండేవి. అయితే కాలక్రమేణా నేడు 5 సమాజాలుగా మిగిలాయి. వాటన్నిటినీ పంచనాటక ఫెడరేషన్‌గా నామకరణం చేశారు. ఇందులో శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి, శ్రీశారదా విజయనాట్యమండలి, శ్రీవిజయభారతి నాట్యమండలి, శ్రీవినాయక నాట్యమండలి, శ్రీ భానోదయ నాట్యమండలి సురభి నాటక కళా సంఘం పేరిట ఫెడరేషన్‌గా ఏర్పడ్డాయి. హైద్రాబాద్ కేంద్రంగా ఉన్న ఫెడరేషన్‌కు అధ్యక్షులుగా ఎ. రామమోహనరావు, కార్యదర్శి ఆర్. నాగేశ్వరరావు (సురభి బాబ్జి) వ్యవహరిస్తున్నారు.

కళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సురభి నాటకం 125 వసంతాల ఉత్సవం జరిగింది. ఎంతో ఘనచరిత్ర కలిగిన సురభి నాటక 125 వసంతాల ఉత్సవాన్ని కళ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంజయ్‌కిషోర్ వారం రోజులపాటు లలిత కళాతోరణంలో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని సురభి బాబ్జీ అన్నారు. హైదరాబాద్‌లో ఓ థియేటర్ నిర్మించి యిస్తే సురభి కళ మాతో అంతరించి పోకుండా ఉండేందుకు ఉపయోగపడుతుంది.

**పగలంతా చదువు.. రాత్రుళ్లు నాటకాలు..**

ఈ కుటుంబంలో పుట్టినవారిలో ఇప్పటితరం వారిలో డిగ్రీలే కాదు.. పీజీలు చేసినవారూ ఉన్నారు. పగలంతా సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు పోయి చదవడం, రాత్రిళ్లు భారీ సెట్టింగ్ మధ్య తమలో దాగి ఉన్న కళను ప్రదర్శించి ప్రేక్షకుణ్ని సంతోషపెట్టడం వారికి అలవాటుగా మారింది.

**సురభి గ్రామంలో మట్టిని బొట్టుగా...**

సురభి గ్రామం కీచకవధ నాటకాన్ని అంకురార్పణ కాగా, అక్కడ తొలినాళ్లల్లో ప్రదర్శించిన ప్రాంగణాన్ని ఇప్పటికీ వారు మరువలేదు. ఆ వేదిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. ●

# మంత్రాలయ రాఘవేంద్రస్వామి పలికే ప్రత్యక్షదైవం!



**పూజ్యాయ రాఘవేంద్రాయ సత్యధర్మ రతాయచ**
**భజతాం కల్పవృక్షాయ నమతాం కామధేనవే**

ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థాయికి చెందిన యతివరేణ్యుడు శ్రీ రాఘవేంద్రస్వామి భౌతికంగా కనిపించకపోయినా తన దివ్యమహిమలతో, లీలలతో ఆశ్రిత భక్తకోటికి ఆపద్బాంధవుడు, ఆరాధ్య దైవగురుడు.

శ్రీరాఘవేంద్రస్వామి పీఠాధిపత్యం వహించేంతవరకు సమతీంద్ర మఠంగా ఉన్న మఠం రాయమఠంగా మార్పు చెందింది. గత జన్మలలోని దేవతాగణంలో శంకువరుణుడనీ, భక్తప్రహ్లాదుడనీ, ఇటీవలి కాలంలో వ్యాసరాయలని శ్రీ రాఘవేంద్రుని విశ్వాసపూర్వకంగా భావిస్తున్నారు.

శ్రీరాఘవేంద్రులు జీవసమాధి చెంది మూడువందల ఏళ్లు దాటినప్పటికీ, ఆయన శక్తి ప్రభావం నిత్యనూతనంగా వర్ధిల్లుతున్నది నిరంతరాయంగా బృందావన దర్శనానికి భక్తి ప్రపత్తులతో జనం వస్తున్నారు.

శ్రీరాఘవేంద్రస్వామి 1571లో కాంచీపురం సమీపంలోని భువనగిరిలో, పవిత్రవర్తనులైన తిమ్మన్నభట్టు, గోపికాంబ దంపతులకు జన్మించారు. తల్లిదండ్రులు వెంకటనాథుడని పేరుపెట్టారు. వీరి తాత కృష్ణభట్టు. ఆయన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానవైణికుడిగా వుండేవారు. బాల్యంలోనే తల్లిదండ్రులు గతించారు. బావగారైన లక్ష్మీనారాయణ పెంపకంలోనే వెంకటనాథుడు సర్వశాస్త్ర పారంగతడుయ్యాడు. యుక్తవయసులోనే సరస్వతి అను కన్యతో వివాహమైంది. ఓ పిల్లవాడు జన్మించాడు. వెంకటనాథునికి దరిద్రం దావానలంలా చుట్టుముట్టింది. నిస్సహాయ స్థితిలో భార్యాబిడ్డలతో కలిసి వెంకటనాథుడు కుంభకోణం చేరుకోగా, అక్కడ బసచేసి ఉన్న శ్రీ సుధీంద్ర తీర్థులవారి ఆశ్రయం లభించింది.

వెంకటనాథున్నాయన ఎంతో ప్రేమగా ఆదరించాడు. శిష్యుని అసమాన్య ప్రజ్ఞాపాటవాలు అతని మేథాశక్తిని, శాస్త్ర జ్ఞాన ప్రావీణ్యాన్ని వెంకటనాథుని వినయ విధేయతలు సుధీంద్ర యతీంద్ర గురువులను బాగా ఆకర్షించాయి.

వయోభారంగా వున్న సుధీంద్రులు వెంకటనాథుని చేరపిలిచి "వెంకటనాథా! నేను వృద్ధాప్యంలో ఉన్నాను. ఈ శరీరం నేడోరేపో అన్నట్టుగా ఉంది. శ్రీరామచంద్రమూర్తి ఆరాధన నిరంతరాయంగా కొనసాగించేందుకు నా తర్వాత నీవు ఈ పీఠాధితప్యం వహించాలి అని మనసులోని కోరికను బయటపెట్టాడు. తనకు భార్యాబిడ్డలున్నారని, కుటుంబపోషణ చేసి వారిని సుఖపెట్టడం తన బాధ్యత అని తన అశక్తతను వెంకటనాథుడు వెల్లడించాడు. గురువుగారి కోరికను తీర్చలేపోతున్నానని వ్యాకులపడుతూ ఇంటికి చేరుకున్నాడు. ఆ రాత్రి సరస్వతీదేవి కలలో ప్రత్యక్షమై 'నాయనా వేంకటనాథా! నీవు కారణ జన్ముడవు. నీ అద్భుత వేదా సంపత్తితో, సద్గురువై దారి తప్పిన జనులకు దారి చూపు! వ్యతిరేక వర్గాల ఎదురు దాడుల నుంచి మధ్వసంప్రదాయాన్ని రక్షించగల సమర్థుడవు నీవే. ఆలోచించక నీ గురువు చెప్పినట్టు చెయ్యి' అని పలికింది. సుధీంద్రులు వెంకటనాథుని తంజావూరులోని తన ఆశ్రమంలో శాస్త్రోక్తంగా సన్యాసదీక్షనిచ్చి రాఘవేంద్రస్వామి దీక్షానామం పీఠాధిపత్యం అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటనాథుని భార్య సరస్వతి దుఃఖ భారంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది.

సన్యాసదీక్ష తీసుకునేనాటికి రాఘవేంద్రుల వయసు 23 ఏళ్లు. తదుపరి 40 ఏళ్లు నియమనిష్టలతో పవిత్రజీవనం గడిపి నిత్య నైమిత్తికాలతో మూలరాముని ఆరాధించాడు. ఈ 40 ఏళ్ల కాలంలో విజయాలు సంఘటనలు, మహిమలు నెరిగిన వారి సోదరి కుమారుడు నారాయణాచార్ 'రాఘవేంద్ర విజయమ్' గ్రంథంలో నిబద్ధం చేశారు.

ఆనాటి నవాబు ఒకరు రాఘవేంద్రులను పరీక్షింపదలచి రెండు బుట్టలతో మాంసం పంపాడు. శిష్యులు ఆ బుట్టలు తెరచి చూడగా పళ్లు, పువ్వులు ఉన్నాయి. ఆయన మృతి చెందిన బాలుడికి ప్రాణం పోశారు. నిరక్షరాస్యుడైన వెంకన్నను ఆదోనిలో గవర్నరు వద్ద దివానుస్థాయికి పెంచారు. సిద్ధి మస్సానెత్‌ఖాన్ మంత్రాలయం గ్రామాన్ని రాఘవేంద్రులకు రాసి ఇవ్వడం (మద్రాస్ డిస్ట్రిక్ట్ గెజిటీ పునర్ముద్రణ 1916 చాప్టర్ 15 ఆదోని తాలూకా పేజీ 213) జరిగాయి. మద్రాసు గవర్నర్ థామస్ మన్రోకు రాఘవేంద్రస్వామి చూపిన అద్భుతాలు 'బళ్లారి గెజట్‌లో ప్రచురితమయ్యాయ్. రాఘవేంద్రుల యశశ్చంద్రికలు దశదిశలా పాకాయి.

నలభైఏళ్లు పీఠాధిపత్యం పూర్తికావస్తున్న సందర్భంలో శిష్యుడైన వెంకన్నను పిలిచి విషయమంతా సేకరించి తుంగభద్రా తీరాన మంత్రాలయంలో తాను జీవ సమాధి కావడానికి బృందావనం నిర్మించమని కోరారు. ఆయన చెప్పిన ప్రకారంగా వెంకన్న చక్కని బృందావన మందిరాన్ని నిర్మించాడు. శ్రీరాఘవేంద్రస్వామి నిత్యనైమిత్తికాలు పూర్తి చేసుకుని, శుచియై, చేతిలో వీణను పట్టుకుని సమాధిలో ప్రవేశించారు. శ్వాస నిలిపివేసి బృందావన సమాధిని మనోలయం చేశారు. సమాధిగతుడైన తర్వాత ఆయన ఎన్నో మహిమలు, అద్భుతాలు చూపారు.

700 సంవత్సరాలు సూక్ష్మరూపంలో బృందావనంలో ఉండి తన భక్తులకు అనుగ్రహిస్తానని ప్రకటన చేశారు. ఆయన ప్రియశిష్యుడు అప్పణాచార్యులు తుంగభద్ర ఆవలి తీరాని వుండేవాడు. గురువు సమాధి ప్రవేశం చేస్తున్నారని తెలిసి, నదిని దాటి, పరుగున బృందావనానికి చేరు కున్నాడు. అప్పటికే అంతా ముగిసింది. అప్పణాచార్యులు కన్నీటి పర్యంతం అయ్యారు. వస్తూ దారిలో అల్లుకుంటూ వచ్చిన శ్లోకంలో ఏడక్షణాలు ముగింపులో కొరవడ్డాయి. వ్యధచెందుతున్న శిష్యుడిని తృప్తి పరచేందుకు ఆ ఏడక్షరాలు సమాధిలోంచి ఆయన వెలువరించారు. ఆ శ్లోకమునే నేటికీ ప్రార్థనలో పఠిస్తారు.

శ్రీమధ్వాచార్యుల వివిధ భాష్యాలకు సులభగ్రాహ్యంగా వ్యాఖ్యానాలు రచించి మధ్వ సిద్ధాంత ఔన్నత్యాన్ని ప్రతిపాదించారు. ఐతరేయోపనిషత్తు మినహా తొమ్మిది ప్రధాన ఉపనిషత్తులకు వ్యాఖ్యానాలు రచించారు. వ్యాసతీర్థం 'చంద్రిక'ను 'ప్రకాశిక' పేరుతో చేసిన పరిమళ వ్యాఖ్యానంతో 'పరిమళాచార్యుడు'గా వాసిగొని నేటికినీ భక్తుల ననుగ్రహిస్తున్న పరమ పూజ్య గురువులు శ్రీ రాఘవేంద్రులు. ●

# ఏలూరు శ్రీ అంబికాదేవి!

ఏలూరులోని అంబికా అగరబత్తీస్ వ్యవస్థాపకుడు అంబికా రామచంద్రరావుగారికి అంబికాదేవిపై అచంచల భక్తి. నిత్యమూ పూజాపునస్కారములు చేసేవారు. అనన్తరమ్ వారి సంతతి అంబికా కృష్ణ, అంబికా ప్రసాద్, అంబికా రాజాలు ఏలూరు విజయవాడ రోడ్‌లో అంబికా ఆలయాన్ని నిర్మించారు. మహాబలిపురంలోని ప్రఖ్యాత శిల్పి గణపతి స్తపతిచే విగ్రహాన్ని చేయించారు. విశాఖ శారదాపీఠాధీశులు శ్రీ స్వరూపానంద స్వామివారి సమక్షంలో కుంభాభిషేకం చేయించారు. అంబిక అన్నా, దుర్గ అన్నా, లలితాపరమేశ్వరీ యన్నా అంబికే! అంబికా వారి ఇలవేలుపు – నిత్యపూజా అర్చనలతో అంబికావారి అగర్‌బత్తీ వ్యాపారం ఆకాశమంత యెత్తుకు ఎదిగింది. స్టార్ హోటల్స్, రెస్టారెంట్స్, గోల్డు బిజినెస్, థియేటర్లు– ఇలా వారి వ్యాపారం పెరిగిపోతున్నది. ఇటీవల అంబికా కృష్ణ టి.టి.డి. అన్నదాన పథకానికి 25 లక్షలు విరాళం యిచ్చారు. ఇలా ఇస్తూంటే వారి సిరీ, వ్యాపారం పెరుగు తున్నాయ్.

సృష్టికి మూలం– శక్తి. ఆ శక్తి ఆరాధనే ముక్తికి సోపానం అనేది అనాదికాలం నుంచి భారతీయుల నమ్మకం. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కూడా శక్తి వల్లనే జన్మించారని దేవీ భాగవతం చెప్తోంది. వారి దేవేరులైన సరస్వతి, లక్ష్మి, పార్వతిలు సృష్టి, స్థితి, లయల్లో త్రిమూర్తులకు సహకరిస్తూ ఉన్నారు. ఈ ముగ్గురిలో పార్వతీదేవి ఆదిపరాశక్తి జగన్మాత. అటువంటి ఆదిపరాశక్తి వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో కొలువుదీరి ఆరాధనలందుకుంటూ ఉంది. ఏ పేరుతో వెలసినా, ఏ క్షేత్రంలో కొలువుదీరినా ఆ జగన్మాత దుష్టశక్తులను అంతమొందించి శిష్టులను కాపాడడం, చెడును తుంచి మంచిని కాపాడడం. తనను నమ్మి కొలిచిన భక్తులపై వరాల జల్లులు కురిపించే జగన్మాత శ్రీఅంబిక పేరుతో ఏలూరులోని ఆలయంలో కొలువుదీరి ఉంది. ఒకమండలం పాటు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసినంతనే కోరిక లన్నింటినీ తీర్చే కల్పవల్లిగా పేరుపొంది అసంఖ్యాక భక్తుల ఆరాధనలందుకుంటూ ఉంది.

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన ఏలూరులో, విజయవాడ నగరానికి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో అంబిక ఆలయం ఉంది.





ఏలూరులో సుమారు 60 సంవత్సరాల క్రితం ఆలపాటి రామచంద్రరావు గారు ఊదుబత్తీల కర్మాగారాన్ని ప్రారంభించి దానికి అంబికా దర్బారు బత్తి అని పేరు పెట్టారు. అప్పటి నుంచి అంబికాదేవి పేరుతో అమ్మవారిని నిత్యం ఆరాధిస్తూనే ఉండేవారు. శ్రీరామ సేవాదురంధరుడైన శ్రీ ఆంజనేయస్వామివారి భక్తులు అయిన రామచంద్రరావుగారు 1964 వ సంవత్సరంలో శ్రీవీరాంజనేయస్వామి వారి ఆలయాన్ని నిర్మించి నిత్య పూజలు జరిపించడం ప్రారంభించారు. ఈ విధంగా సుమారు 40 సంవత్సరాలు గడిచాయి. తాను నిత్యం ఆరాధిస్తూ ఉన్న శ్రీ అంబికాదేవి అప్పుడప్పుడు స్వప్నంలో దర్శనమిస్తూ ఉండడంతో శ్రీఅంబికాదేవికి ఆలయం నిర్మిస్తే బావుంటుందని భావించి 2004వ సంవత్సరంలో ఆలయ నిర్మాణం చేయాలని నిర్ణయించుకుని శంఖుస్థాపన కార్యక్రమాలను నిర్వహించి నిర్మాణాన్ని ప్రారంభించారు. సుమారు 18 నెలలు విగ్రహ తయారీకి పట్టింది. ఆలయ నిర్మాణం పూర్తయ్యాక 2006వ సంవత్సరం ఫిబ్రవరి 18వ తేదీన ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించారు. అదే సమయంలో శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయాన్ని కూడా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది గోపురం నిర్మించడంతోపాటు ధ్వజస్తంభం, ఆంజనేయస్వామివారి వాహనమైన ఒంటెవాహనాన్ని ప్రతిష్ఠింపజేశారు. అప్పటి నుంచి ఆలయాల్లో దేవతామూర్తులు పూజల కోసం నిత్యం భక్తులు విశేషంగా వస్తున్నారు.

ఏలూరులోని శ్రీ అంబికా ఆలయం తూర్పు అభిముఖంగా ఉంది. అంబికా ఆలయం పక్కనే ఒకే ప్రాంగణంలో శ్రీ వీరాంజనేయస్వామి వారి ఆలయం కూడా ఉంది. ఆలయంలోనికి ప్రవేశించేందుకు రెండింటికి విడివిడిగా స్వాగత తోరణాలు నిర్మింపబడి ఉన్నాయి. అమ్మవారి ఆలయ ప్రవేశద్వారంపై ఉన్న స్వాగత తోరణం మధ్యన ఉన్న మండపంలో శ్రీఅంబికా అమ్మవారు, శ్రీ వీరాంజనేయస్వామివారి ఆలయ ప్రవేశద్వారంపై ఉన్న మండపంలో శ్రీ వీరాంజనేయస్వామివారు దర్శన మిస్తారు. స్వాగత తోరణంనుంచి లోపలకూ ప్రవేశిస్తూనే *(తరువాయి 12వ పేజీలో)*

# ప్రఖ్యాత ఆంగ్ల పాత్రికేయుడు ఈశ్వరదత్తు కుందూరు



ఇంగ్లీషు పత్రికలలో పనిచేసి ఖ్యాతి గాంచిన పలువురు పత్రికా రచయితల్లో కుందూరు ఈశ్వరదత్తు ప్రముఖులు. 1898 సెప్టెంబరు 27న రాజమండ్రిలో జన్మించారు. వీరి తండ్రి వెంకట రత్నంగారు హెడ్మాస్టర్‌గా గాంధేయవాదిగా ప్రసిద్ధులు. తండ్రి వద్దనే వీరు ఇంగ్లీష్ గ్రామర్ నేర్చారు. రాజమండ్రి బందరులలో చదివారు. 1923లో పట్టభద్రు లయినారు. మొదటి నుండి జర్నలిజం పట్ల అభిలాష ఎక్కువ. విద్యార్థిగా మచిలీపట్నంలో Fresh Mens Magzine పత్రిక సంపాదకత్వం వహించారు. అలహాబాద్ నుండి వెలువడే ఆంగ్ల దినపత్రిక The Independent తో జర్నలిజంలో ప్రవే శించారు. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు గారు స్థాపించిన 'స్వరాజ్య' సంపాదకవర్గంలో చేరారు. స్వరాజ్యలో ఉండగానే 12 మంది స్వాతంత్ర్య సమరయోధులు గూర్చి రాశారు. తర్వాత పుస్తక రూపంలో ప్రచురించారు. వీరికీ గ్రంథం మంచి గుర్తింపు తెచ్చింది.

1929లో హిందూ పత్రికలో శ్రీ రంగస్వామి అయ్యం గార్ ఆహ్వానం మేరకు చేరారు. సి.వై. చింతామణి పిలుపు మేరకు వీరు అలహాబాద్ వెళ్ళి The Leader లో మూడు సంవత్సరాలు పనిచేశారు. తరువాత Twentieth Century అనే మాసపత్రికను సొంతంగా నిర్వహించారు. 1934 నుండి 12 ఏండ్లు సాగిన ఈ పత్రిక బహుళ ప్రచారం పొందింది. యం.ఆర్. జయకర్, సర్ సి.పి. రామస్వామి అయ్యర్ వంటివారు ఆ పత్రికను కొనియాడారు.

పిఠాపురం మహారాజా తన ఎన్నికల ప్రచారానికి స్థాపించిన The Peoples Voice లో ఒక సంవత్సరం (1936–37) పనిచేశారు. తిరిగి అలహాబాద్ వెళ్ళి Twentieth Century కొనసాగించారు. 1942లో జయపూర్ సంస్థానంలో దివానుగా వున్న మీర్జా ఇస్మాయిల్ పిలుపుమేరకు నాలుగేండ్లు అక్కడ ప్రచార శాఖాధిపతిగా ఉన్నారు. అప్పుడే న్యూస్ లెటర్ అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించారు. 1947 మీర్జా రాజీ నామాతో వీరు ఆ ఉద్యోగం వదలివేశారు. 1948 సెప్టంబర్‌లో The Hindustan Times లో సహాయ సంపాదకులుగా నియమితులైనారు. అక్కడ రిఫరెన్స్ గ్రంథాలయం ఏర్పాటులో వీరు ప్రముఖంగా కృషి చేసారు.

1949లో ఢిల్లీలో జర్నలిస్టు సంఘం స్థాపకులలో వీరొకరు. 1952 – 53లో ఆ సంఘ అధ్యక్షులై జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. సి.వై. చింతామణి నిర్వహించిన The Leader ప్రధాన సంపాదకులుగా 15 సంవత్సరాలు పనిచేసి ప్రఖ్యాతి గడించారు. 1955లో మేనేజ్ మెంట్‌తో విభేదించి రాజీనామా చేసి పత్రికా రచయితల ఆత్మగౌరవం నిలిపిన వాడని ప్రశంస లందుకున్నారు. భారతీయ జాతీయ కాంగ్రెస్ చరిత్రను Cyclopedia పేరిట రాయడం ప్రారంభించి, కొంత పూర్తి చేశారు. 1967లో వీరి అకాల మరణంతో అది అర్ధాంతరంగా నిలిచిపోయింది.

(రావినూతల శ్రీరాములుకు కృతజ్ఞతలతో)


భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది
AMBICA DURBAR BATHI
అంబికా దర్బార్‌బత్తి




(11వ పేజీ తరువాయి)

బలిపీఠం, ధ్వజస్తంభం ఉన్నాయి. ప్రధాన ఆలయ ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది. ప్రధాన గర్భా లయలో శ్రీ అంబిక అమ్మవారు కొలువుదీరి ఉన్నారు. గర్భా లయం వేదిక పైన ఉన్న సింహ వాహనంపై శ్రీ అంబిక అమ్మ వారు అష్టభుజాలతో ఆశీనురాలై ఉన్నారు. ధనస్సు, శూలము, బాణములు, డాలు, ఖడ్గము, శంఖము, చక్రము, గదలను తన ఎనిమిది చేతులలో ధరించి 'దివ్య' అలంకరణలతో భక్తులపై కరుణా కటాక్షాలను ప్రసరింప జేస్తూ దర్శనమిస్తుంది. అమ్మ వారికి ఎదురుగా శ్రీచక్రం ప్రతి ష్ఠింపబడి ఉంది.

ప్రధాన గర్భాలయంలో శ్రీ వీరాంజనేయస్వామివారు కొలువుదీరి ప్రశాంత వదనంతో దర్శనమిస్తూ ఉంటారు. ఆలయ ప్రాంగణంలో అంబికాదేవి ఉత్సవమూర్తి, గోడలపైన సుందర కాండ దృశ్యాలు, శ్రీ గోదా దేవిని దర్శించగలం. శ్రీ అంబికా అమ్మవారికి ప్రతి శుక్రవారం కలువ, తామర పద్మములతో సహస్ర నామార్చన, పౌర్ణమినాడు ప్రదోష సమయంలో ఏకాదశ ద్రవ్యాలతో అభిషేకం, శ్రీ చక్రనవార్ణ అర్చనలు విశేషంగా జరుగు తాయ్. సాయంత్రం వేళ లలితా సహస్రనామపారాయణం, పంచ హారతులు జరుగుతాయి. ఆశ్వ యుజ మాసంలో దేవీ నవరాత్రుల సంద ర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలం కారాలు, పూజలను నిర్వహిస్తారు.



శ్రీమహాలక్ష్మి, శ్రీ సరస్వతీదేవి, శ్రీ దుర్గాదేవి, శ్రీమహిషాసుర మర్దిని, శ్రీరాజరాజేశ్వరీ దేవి, శ్రీ బాలత్రిపురాసుందరిదేవి, శ్రీగాయత్రీదేవీ, శ్రీలలిత త్రిపురసుందరి అలంకారాలతో అమ్మవారు దర్శనమిస్తారు. ●